క్లుప్తంగా

నేడు సీతారాముల కల్యాణోత్సవం

సదుం: మండలంలోని పెడకంటివారిపల్లె కోదండరామాలయంలో శనివారం రాత్రి 7 గంటలకు సీతారామ కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ వంశపరాంపర్య ధర్మకర్త గౌతమ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, కలశ స్థాపన, నవగ్రహ ఆరాధన, హోమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులకు రాత్రి ఆలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

నేడు మున్సిపల్ సమావేశం

పుంగనూరు: మున్సిపల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశంలో చర్చించనున్నట్లు చెప్పారు. అలాగే వేసవిలో పట్టణ ప్రజల ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి సభ్యులు, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

ఆర్టీసీ చార్జీలు తగ్గింపు

పుంగనూరు: పుంగనూరు డిపో నుంచి బెంగళూరుకు వెళ్లే ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీస్ చార్జీలను తగ్గించినట్లు డీఎం సుధాకరయ్య తెలిపారు. ప్రతి రోజు రెండు బస్సులు బెంగళూరుకు నడుస్తున్నాయని చెప్పారు. ఇందులో రూ.170 ఉన్న టికెట్టును రూ.155లకు తగ్గించినట్లు తెలిపారు. ప్రజల సౌకర్యార్థం రూ.15 తగ్గించామన్నారు. ప్రజలు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తిరువణ్ణామలై టికెట్టు రూ.540

పుంగనూరు: పుంగనూరు ఆర్టీసీ డిపో నుంచి తమిళనాడులోని తిరువణ్ణామలైకు రానుపోను ఛార్జీలు రూ.540గా నిర్ణయించినట్లు డీఎం సుధాకరయ్య తెలిపారు. మే 4వ తేదీ పున్నమి సందర్భంగా తమిళనాడుకు బస్సులు నడుపుతున్నామన్నారు. రిజర్వేషన్ సౌకర్యం ఉందని తెలిపారు.

విరూపాక్షి మారెమ్మకు పూజలు


ప్రత్యేక అలంకారంలో విరూపాక్షి మారెమ్మ

పుంగనూరు: పట్టణంలోని శ్రీవిరూపాక్షి మారెమ్మ ఆలయంలో శుక్రవారం మధ్యాహ్నం రాహుకాల పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని చందనం, పూలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై గుమ్మిడికాయలు, టెంకాయలతో దిష్టి తొలగించుకున్నారు. అమ్మవారికి పిండి దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

వాటర్‌షెడ్ రైతులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

సదుం: స్థానిక సీఎల్‌ఆర్‌సీ భవనంలో రైతులకు ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వాటర్‌షెడ్ రైతులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏరువాక కేంద్రం విస్తరణ శాస్త్రవేత్త రాఘవేంద్ర రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. మామిడి, టమాట పంటల్లో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణకు చేపట్టాల్సిన విధానాలపై వివరించారు. మేఘదూత్ (వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు), ఈనామ్ (మార్కెట్ సమాచారం) యాప్‌ల గురించి వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త సుధారాణి, వాటర్‌షెడ్ పీఓ శోభారాణి పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ


కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

గుడుపల్లె: ఉపాధిహామీ పథకంలో చేస్తున్న పనులు నీటి నిల్వ కోసం ఉపయోగపడే విధంగా ఉండాలని ఎంపీడీఓ రమణ అన్నారు. శుక్రవారం మండలంలోని చీకటిపల్లెలో పనులను తనిఖీ చేశారు. పచ్చార్లపల్లె గ్రామ సమీపంలోని గట్టులో రూ. 60 లక్షలతో చేస్తున్న ట్రెంచింగ్ పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. పనులు జరిగే ప్రదేశం వద్ద తగిన సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎండకు ముందే పనులు పూర్తి చేయాలని సూచించారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు


విశేష అలంకరణలో గంగమ్మ

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి నిత్యకైంకర్యాలు పూర్తి చేశారు. వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. రాహుకాల సమయంలో వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అభిషేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గంగమ్మను దర్శించుకున్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే వెంకటేగౌడ
- ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం


సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పెద్దపంజాణి: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. శుక్రవారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో కలిసి మండలంలోని కంగానంబండ, బొమ్మరాజుపల్లి, కుంటకిందపల్లి, వలసపల్లిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నాయకులు, అధికారులతో కలిసి 388 ఇళ్లకు వెళ్లారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను ఎమ్మెల్యే వారికి వివరించారు. ప్రభుత్వం అందించిన లబ్ధిని తెలిపే బుక్‌లెట్‌ను పంపిణీ చేశారు. స్థానికులు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్ రెడ్డి అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా పథకాలు అమలు చేస్తున్నారని వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. సీఎం ప్రజా సంక్షేమ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు.

పాఠశాల తనిఖీ

వలసపల్లి ఎంపీపీ పాఠశాలను జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు ఆయనే భోజనం వడ్డించారు. అనంతరం బొమ్మరాజుపల్లి సమీపంలోని ఎదురు బండపై వెలసిన అష్ట కాళభైరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో వలంటీర్, సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని తెలిపారు. పేద ప్రజల కోసం వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ హనుమంతు, పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్ కుమార్ రెడ్డి, ఎంపీపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యురాలు సుష్మకీర్తి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగారెడ్డి, వైస్ ఎంపీపీ జీడీ బాబు, సింగల్ విండో చైర్మన్ ఓబుల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, ఏఎంసీ డైరెక్టర్‌లు సురేష్, ఎర్రబల్లి శ్రీనివాసులు, సర్పంచ్ శారద మునిరెడ్డి, ఎంపీటీసీ వెంకటరత్నమ్మ, నాయకులు అమరనాథరెడ్డి, సుబ్రమణ్యం, రాజారెడ్డి, ఆంజప్ప పాల్గొన్నారు.

అటవీ గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి


సంక్షేమ బావుటా కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్

- గజ దాడుల నివారణకు చర్యలు
- నారాయణపురం తండా పరిధిలో సోలార్ కంచె
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: అటవీ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. శుక్రవారం మండలంలోని నారాయణపురం తండా పంచాయతీ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అటవీ సరిహద్దు గ్రామాల్లో తరచూ ఏనుగుల దాడుల వల్ల పంటలు నాశనం అవుతున్నాయని రైతులు భరత్ దృష్టికి తీసుకెళ్లారు. గజ దాడుల్లో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందడంలేదన్నారు. స్పందించిన భరత్ అటవీ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రెండు రోజుల్లో నష్టపరిహారం చెక్కులను అందజేస్తామన్నారు. అదేవిధంగా నారాయణపురం తండా పరిధిలో త్వరలోనే సోలార్ కంచెను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కౌండిన్య అభయారణ్యంలో ఏనుగుల దాడుల నివారణకు అటవీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. గ్రామంలో కాలువల నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరారు. గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను భరత్ ఆదేశించారు.

రమేష్ కుటుంబానికి అండగా ఉంటాం

మండలంలోని ముద్దనపల్లి పంచాయతీ వార్డు సభ్యుడు రమేష్ ఇటీవల మృతి చెందాడు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ భరత్ వార్డు మెంబర్ కుటుంబాన్ని పరామర్శించి అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందజేస్తామన్నారు. ఎంపీడీఓ రాధాకృష్ణ, ఎస్‌ఐ కృష్ణయ్య, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, పార్టీ కోకన్వీనర్ చంద్రారెడ్డి, కేశవరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన మహాభారత ఉత్సవాలు


భక్తులకు అభివాదం చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి


దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

శాంతిపురం: కర్లగట్టలోని ద్రౌపతి సమేత శ్రీధర్మరాజుల స్వామి ఆలయంలో ఈ నెల 10 నుంచి జరిగిన మహాభారత ఉత్సవాలు శుక్రవారం శ్రీధర్మరాజస్వామి వారి పట్టాభిషేకంతో ముగిశాయి. 19 రోజుల పాటు ధర్మరాజుల స్వామికి ప్రత్యేక పూజలు, మహాభారతంలోని వివిధ ఘట్టాల నాటక ప్రదర్శనలు నిర్వహించారు. గురువారం జరిగిన దుర్యోధన వధ ఘట్టానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్ స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు పాండవులకు దీపారాధన, తిలతర్పణం, పొంగళ్లు సమర్పించారు.

రేపటి నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు

సదుం: మండలంలోని బూరగమంద భూదేవి, శ్రీదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 30 నుంచి మే 10వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో 30న అంకురార్పణ, మే 1న ధ్వజారోహణం, 2న శేషవాహన సేవ, 3న హంసవాహనం, 4న హనుమంత వాహన సేవ జరగనుంది. 5న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం, గరుడ వాహనం, 6న పుష్పపల్లకి, 7న సింహవాహనం, 8న అశ్వవాహనం, 9న గజవాహన సేవలు జరగనున్నాయి. 10న పుష్పయాగం, శయనోత్సవం నిర్వహిస్తారు.

13న జాతీయ లోక్ అదాలత్

- సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు

పలమనేరు: పట్టణంలోని ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో మే 13వ తేదీ జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు తెలిపారు. ఎలాంటి కేసులనైనా రాజీ చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. రాజీ మార్గమే ఉత్తమమని.. కక్షిదారులు పంతాలకు పోకుండా కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని తెలిపారు. ప్రీలిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చన్నారు. చెక్‌బౌన్స్, జీవనాధారం, వేధింపులు, గృహహింస తదితర సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకునేందుకు మంచి అవకాశమన్నారు.

హుండీ కానుకలు చోరీ

పలమనేరు: పట్టణ సమీపంలోని టీఎస్ అగ్రహారం సుబ్రమణ్యస్వామి ఆలయంలో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ ప్రధాన ద్వారాన్ని ధ్వంసం చేసి గుడిలోని మూడు హుండీలను పగులగొట్టి అందులోని కానుకలను అపహరించారు. ఈ సంఘటన గురువారం రాత్రి జరగ్గా శుక్రవారం గ్రామస్తులు గుర్తించారు. వారి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు ఆలయం వద్ద విచారణ చేశారు. చోరీకి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, నాయకులు మండీసుధా, రెడ్డెప్పరెడ్డి ఎస్‌ఐ సుబ్బారెడ్డిని కోరారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

చౌడేపల్లె: అనాథ శవానికి శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. సుమారు 15 రోజులుగా ఓ మహిళ (38) అనారోగ్యంతో బాధపడుతూ స్థానిక బస్టాండ్ సమీప ప్రాంతాల్లో సంచరిస్తూ ఉండేది. పరిస్థితి విషమించడంతో మృతిచెందింది. గమనించిన స్థానికులు సర్పంచ్ వరుణ్ భరత్, ఎస్‌ఐ రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. పారిశుద్ధ్య కార్మికులు దహన సంస్కారాలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు.

రేపటి నుంచి గడప గడపకు..

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలో ఈనెల 30వ తేదీ నుంచి మే 2వ తేదీ వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ, మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర పట్టణంలోని 19,5,6,7 వార్డుల్లో పర్యటిస్తారని పేర్కొన్నారు. అధికారులు, కౌన్సిలర్లు, సచివాయల సిబ్బంది హాజరుకావాలన్నారు.

పీహెచ్‌సీలో కొళాయిలు ప్రారంభం

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లి పీహెచ్‌సీలో వాటర్ ఎయిడ్ సంస్థ నిర్మించిన రెండు మరుగుదొడ్లు, నీటి కొళాయిలను మండల వైద్యాధికారి మల్లికార్జునరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. వీటిని రూ.2.40 లక్షల వ్యయంతో నిర్మించారు. కార్యక్రమంలో వాటర్ ఎయిడ్ జిల్లా కోఆర్డినేటర్ మధుసూదన్, అనోహి, జయశంకర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు సంతృప్తి చెందేలా సేవలు


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: ప్రజలు సంతృప్తి చెందేలా సచివాలయాల్లో సేవలను మరింత మెరుగ్గా అందించాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం వి.కోట ఎంపీడీఓ మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలో జరుగుతున్న గృహ నిర్మాణ పనులపై నిత్యం పర్యవేక్షణ ఉండాలన్నారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందించి త్వరితగతిన పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అలాగే ఉపాధి హామీ, పీఆర్, నాడు–నేడు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లీనిక్ నిర్వహణపై ఆయా శాఖాధికారులతో చర్చించారు. ఎంపీడీఓ మహేష్, ఎంఈఓ చంద్రశేఖర్, పీఆర్ ఏఈ శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ రామచంద్ర, ఏపీఓ అశోక్ పాల్గొన్నారు.

శివారు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు


పనులను ప్రారంభిస్తున్న కమిషనర్

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని విస్తరణ ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, విద్యుత్ దీపాలు, పైప్‌లైన్ల ఏర్పాటు పనులు ముమ్మరంగా చేపట్టినట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సూర్యనగర్‌లోని 3వ వార్డు, 8వ వార్డులో కాలువలు, రోడ్డు పనులకు కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. పట్టణంలో రూ.కోటి ప్రత్యేక నిధులతో కాలువల నిర్మాణ పనులు చేపట్టామన్నారు. మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలుపుతామన్నారు. కార్యక్రమంలో డీఈఈ మహేష్, ఏఈ కృష్ణకుమార్, కాంట్రాక్టర్ మునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మణ్‌రాజు, కొండవీటి నరేష్ పాల్గొన్నారు.

ఈతకు వెళ్లే విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

పుంగనూరు: వేసవిలో ఈతకు వెళ్లే విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఫైర్ ఆఫీసర్ సుబ్బారాజు తెలిపారు. శుక్రవారం స్థానిక అగ్నిమాపక కేంద్రంలో విద్యార్థులకు ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈతకు వెళ్లే వారు తాడు, బెండ్లు, ట్యూబ్‌లు కట్టుకుని పెద్దల పర్యవేక్షణలో ఈత కొట్టాలన్నారు. ఒకవేళ ప్రమాదవశాత్తు పిల్లలు మునిగిపోయినా తక్షణమే వారిని బయటకు తీసి తలకిందులుగా పట్టుకోవడం, కడుపుపై ఒత్తడంతో నీరు బయటకు వస్తుందని తెలిపారు. పిల్లలకు ముప్పులేకుండా ఉంటుందన్నారు. ఈ విషయాలపై ప్రయోగం చేసి చూపారు. ఈ విషయంలో తల్లిదండ్రులు తగిన అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

మార్కెట్ యార్డు పనులు వేగవంతం చేస్తాం


ఏఓ సుధాకర్, చిత్రంలో చైర్మన్ అరుణమ్మ

సోమల: వ్యవసాయ మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశం చైర్మన్ అరుణమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సభ్యులు మాట్లాడుతూ.. మార్కెట్ యార్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. చైర్మన్ అరుణమ్మ మాట్లాడుతూ.. మంత్రి పెద్దిరెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిర్మాణాలను పూర్తి చేస్తామని.. రైతన్నలను అండగా ఉంటామని తెలిపారు. ఏఓ సుధాకర్ మాట్లాడుతూ.. రైతుల కోసం ప్రవేశపెడుతున్న పథకాలను ఎప్పటికప్పుడు రైతు భరోసా కేంద్రాల ద్వారా తెలియజేస్తున్నామని.. వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధిలోని రావాలని కోరారు. వైస్ చైర్మన్ శివారెడ్డి, మాజీ చైర్మన్ నాగేశ్వరరావు, కార్యదర్శి సరళాకుమారి తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన గురుకుల బాలిక

- రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం


తల్లిదండ్రులతో లావణ్య

సత్యవేడు: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో సత్యవేడు అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాలలో బైపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న డి.లావణ్య 432/440 మార్కులు సాధించి రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో ప్రథమ స్థానంలో నిలిచిందని ఆ కళాశాల ప్రిన్సిపల్ ప్రసూన తెలిపారు. ఆమె తల్లిదండ్రులు త్యాగరాజులు, దేవి వ్యవసాయ కూలీలని చెప్పారు. రామకుప్పం మండలం జవుకుపల్లెకు చెందిన లావణ్య చదువుల్లో బాగా రాణిస్తోందని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల అధ్యాపకులతోపాటు ఎంఈఓ రవి అభినందించారు.

రైతులకు గిట్టుబాటు ధర అందించండి


మాట్లాడుతున్న పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి

సోమల: రైతులకు గిట్టుబాటు ధర అందించాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కలికిరి రోడ్డులో మామిడి కాయల మండీని ఆయన ప్రారంభించారు. రైతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరయ్య, వైస్ ఎంపీపీ ప్రభాకర, మండీ నిర్వాహకుడు షావలీ, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు నాగభూషణంరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, నేతలు సాంబయ్య, వెంకటరమణ, రమణ, సర్పంచ్ బాషా మసూద్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం


పలమనేరు: పలమనేరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ, అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు మెయిన్ అంగన్‌వాడీ పోస్టులు, 9 అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. మే 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని రహమత్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్ పోస్టు (ఓసీ)కు దరఖాస్తు చేసుకోవాలని సూపర్‌వైజర్ ఆయిషా తెలిపారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రొంపిచెర్ల/పులిచెర్ల: రొంపిచెర్ల, పులిచెర్ల మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భారతి, విజయలక్ష్మి కోరారు. బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ కుమ్మరపల్లె (ఓసీ), పులిచెర్ల మండలం 106 రామిరెడ్డిపల్లెలో అంగన్‌వాడీ కార్యకర్త (ఓసీ), కావేటిగారిపల్లెలో సహాయకురాలు (ఓసీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పదో తరగతి పూర్తి చేసిన 18–35 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. దరఖాస్తులను మే 13వ తేదీలోపు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

సదుం: మండలంలోని పుట్టావారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త పోస్టు ఖాళీగా ఉన్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత తెలిపారు.

శేషవాహనంపై మృత్యుంజయేశ్వరుడు



చౌడేపల్లె: మండల కేంద్రంలో వెలసిన శ్రీఅభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గో రోజు శుక్రవారం స్వామి వారిని శేషవాహనంపై ఊరేగించారు. ప్రతి ఇంటి వద్ద స్వామివారికి కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదారులుగా ఆర్యవైశ్య కులస్తులు వ్యవహరించారు. అర్చకులు రాజశేఖర దీక్షితులు, కుమారస్వామి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

కల్యాణ వైభోగమే

యామగానిపల్లెలోని ధర్మరాజుల ఆలయంలో మహా భారత మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ద్రౌపదీ ధర్మరాజుల కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఆలయం వద్ద పచ్చని తోరణాలతో పందిరి వేసి ముస్తాబు చేశారు. పాండవులు, ద్రౌపదీ దేవి విగ్రహాలను ఏర్పాటు చేశారు. పట్టువస్త్రాలతో విగ్రహాలను ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ ధర్మరాజు ద్రౌపది అమ్మవారి కల్యాణోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. - గుడుపల్లె


కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు (ఇన్‌సెట్‌లో) ప్రత్యేక అలంకరణలో పాండవుల విగ్రహాలు